క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం కుద్బుద్దీన్ తదితరులు

షాబాద్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయ వృత్తి కీలక భూమిక పోషిస్తుందని చందనవెల్లి మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కుద్బుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెళ్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవలీల, సరిత, మహేందర్‌లను ఘనంగా సన్మానించారు. ప్రతి ఉపాధ్యాయుడికి బదిలీ అనేది తప్పనిసరని చెప్పారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసిన పట్టుదలతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు అనేది ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ మండల ప్రత్యేకాధికారిగా కిషన్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కిషన్‌రావు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండల ప్రత్యేకాధికారిగా కె.కిషన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. నెలరోజుల క్రితం ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక పాలనలో భాగంగా అప్పటి నుంచి ఇప్పటివరకు మండల ప్రత్యేకాధికారి స్థానం ఖాళీగా ఉంది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లా హార్టికల్చర్ అధికారి కె.కిషన్‌రావును మండల ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న నటరాజ్, తదితరులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతతను పొందాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.1లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్ ఆలయ కమిటీ సభ్యుడు కక్కునూరి వెంకటేశ్‌గుప్తాకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు విజయకుమార్‌గౌడ్, రాజు, శ్రీనివాస్, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి కృషి చేయండి

ఎమ్మెల్యేకు ఆ సంఘం నాయకుల వినతి

షాద్‌నగర్‌రూరల్: చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గంగపుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని మత్స్య సహకార సంఘం నాయకులు కోరారు. సంఘం భవన నిర్మాణానికి నిధులను కేటాయించాలని కోరుతూ గంగపుత్ర సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగపుత్రులు కులవృత్తినే నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. గంగపుత్రుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు. పట్టణంలో మత్స్య సహకార సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులను కేటాయించాలని కోరారు. అదేవిధంగా చేపలను విక్రయించేందుకు అనువుగా షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ.. కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. గంగపుత్రుల అభివృద్ధికి తనవంతు సహాయాన్ని అందిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను నాయకులు శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు గంగనమోని సత్తయ్య, సంతోష్‌కుమార్, నందు, కుమార్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతతో వ్యాధులు దూరం

- రెండోరోజు కొనసాగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది



మొయినాబాద్: చిలుకూరులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



కొత్తూరు: వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య తదితరులు

మొయినాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవని, ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చిలుకూరులో వాటర్ ట్యాంకులు, పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్త వేరుచేయాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలని చెప్పారు. రోడ్లపై, వీధుల్లో నీళ్లు నిల్వ ఉండనీయొద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

కొత్తూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన మొక్కలు నాటారు. షెడ్యూల్ ప్రకారం అధికారులు అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, లింగంనాయక్, రవి కుమార్‌గుప్తా, అంబటి ప్రభాకర్, శంకర్‌నాయక్, బిచ్చానాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని అయా వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కౌన్సిలర్లు, నాయకులు శ్రమదానం చేశారు. అంతేకాకుండా రోడ్లు, ఇళ్ల మధ్యలో, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన కంపచెట్లు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, వార్డుప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చేవెళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చేవెళ్లలోని పుష్కరిణీ సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐదురోజుల ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రతన్‌కాలనీ, అంజయ్య కాలనీల్లో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, ఏఈ రాయుడు, కౌన్సిలర్ నడికూడ సరిత నాయకులు విశ్వం, తిరుపతిరెడ్డి, బాబర్‌ఖాన్, దంగు శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, నడికూడ యాదగిరియాదవ్, రాజేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, బస్వం, నర్సింలు యాదవ్, నలమోని శ్రీధర్, లక్ష్మణ్, రమేశ్, ప్రత్యేకాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని నందిగామ, కేశంపేట, కొత్తూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివశంకర్‌గౌడ్, ప్రియాంక, వీరేశం, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహా, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పిస్తే అందుబాటులో ఉంటా

యూత్ కాంగ్రెస్ బరిలో మైపాల్‌యాదవ్

చేవెళ్ల: యువతకు అధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న యూత్ నాయకుడు మైపాల్‌యాదవ్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. యూత్ కాంగ్రెస్ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా జరిగే ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయాలని సూచించారు. నియోజకవర్గంలోని కొండకల్ గ్రామానికి చెందిన తాను నియోజకవర్గంలోని ఐదు మండలాల యూత్ కాంగ్రెస్ సభ్యులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. తనకు అవకాశం కల్పించి గెలిపిస్తే నియోజకవర్గంలో యూత్ కమిటీలను బలోపేతం చేస్తానని చెప్పారు. స్థానిక యూత్ కాంగ్రెస్‌లో పనిచేస్తున్న తనకు అవకాశం కల్పించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

విరాళాల సేకరణ

కొందుర్గు: కేరళలో వరద బాధితుల సహాయార్థం కొందుర్గులో సీపీఐ నాయకులు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు యాదయ్య మాట్లాడుతూ.. ప్రకృతి సుందరమైన కేరళ రాష్ట్రం వరద కారణంగా అతలాకుతలమైందన్నారు. కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఊళ్లు ధ్వంసమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో తోచిన సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొక్క నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, డీపీఓ సురేశ్‌మోహన్ తదితరులు

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌తో కలిసి ఆయన మొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకు పరిశ్రమలు ఎక్కువ కావడంతో అడవులు అంతరించి పోతున్నాయని, దీంతో మానవాళి మనుగడే ప్రశ్నార్థం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సతీశ్, ఎంపీడీఓ వెంకయ్య, ఏపీఓ నాగభూషణం, ఏపీఎం భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమస్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు సంఘాల నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని, రాష్ట్ర ప్రజల గుండెల్లో ఆయన శాశ్వతంగా నిలిచిపోయారని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు.



చేవెళ్ల: విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



మొయినాబాద్‌లో..



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జేఏసీ నాయకులు



షాద్‌నగర్‌రూరల్: ఆస్పత్రి ఆవరణలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు



కొందుర్గు: చౌదరిగూడలో..



మొయినాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయకోట, సిబ్బంది

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు



షాద్‌నగర్‌రూరల్: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అండాలు

షాద్‌నగర్‌రూరల్: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలను పట్టించాలన్నారు. ముర్రు పాలు రోగ నిరోధకశక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయని, నవజాత శిశువులను అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శాదరమ్మ, రోజా, రంగమ్మ, ఆయా సంతోష, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు

నందిగామ: సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని, బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకునే దేవత అమ్మ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకుముందు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శివశంకర్‌గౌడ్, ప్రియాంక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కొమ్ము కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి, శివ, శ్రావణ్, రాజశేఖర్, వెంకట్ చారీ, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, అంగన్‌వాడీటీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జంగోనిగూడ గ్రామ సమీపంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట



చేవెళ్లలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ నాయకులు

చేవెళ్ల: పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి వచ్చిన 188 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన యూనిఫాంలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

షాబాద్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో షాబాద్ మండలానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు 12 లక్షల 44 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు ఖాజామియా పటేల్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

ఏఓ రాగమ్మ బదిలీ



మొయినాబాద్: మండల వ్యవసాయాధికారి రాగమ్మ బదిలీ అయ్యారు. మంగళవారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఆమె రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రానికి బదిలీ అయ్యారు. మొయినాబాద్ మండల వ్యవసాయాధికారిగా రాగమ్మ సుమారు 14 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆమె స్థానంలో కొత్త ఏఓగా అనురాధ ఇక్కడికి రానున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి అశోక్



చేవెళ్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎస్సీ డిక్లరేషన్‌కు సంబంధించి ఇచ్చిన హామీలకు వెంటనే నిధులు కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టి తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ, బీసీ డిక్లరేషన్‌లు అంటూ గొప్పగా ఆర్భాటాలు చేసి అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయటం లేదన్నారు. ఎస్సీ డిక్లరేషన్ సభలో అంబేడ్కర్ అభయ హస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్ సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్నిర్మాణం లాంటి అనేక అంశాలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులను కేటాయించకపోవటాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. ఈ హామీలను అమలు చేసేందుకు వెంటనే నిధులు కేటాయించి అమలు చేయాలన్నారు. ప్రజల పక్షాన నిలబడి బీజేపీ పోరాటం చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుగౌడ్, అనంత్‌రెడ్డి, శర్వలింగం, జి.కృష్ణాగౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, అభిలాస్, చంద్రశేఖర్, జయసింహారెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దేవేందర్, పంచాయతీ కార్మికులు

షాబాద్: ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న తేదీన గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలని ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాండ్ కేటాయించాలన్నారు. పీఆర్సీలో అర్హులుగా గుర్తించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల ఉపాధ్యక్షులు యాదయ్య, లక్ష్మయ్య, చంద్రయ్య, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.